సమస్యల పరిష్కారంలో డీపీటీఓ విఫలం


మాట్లాడుతున్న శివారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: రీజియన్ వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో డీపీటీఓ విఫలమయ్యారని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ.శివారెడ్డి తెలిపారు. కడప యూనియన్ కార్యాలయంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజనల్ అధ్యక్షుడు ఎస్.నాగముని అధ్యక్షతన జరిగిన రీజనల్ సమావేశంలో శివారెడ్డి మాట్లాడారు. మెజార్టీ అసోసియేషన్‌గా డీపీటీఓకు మెమోరాడం ఇచ్చి రెండు నెలలు కావస్తున్నా చర్చలకు పిలవలేదని ఆరోపించారు. డిపో మేనేజర్లు 1/2019 సర్క్యులర్‌కు విరుద్ధంగా పనిష్మెంట్ ఇస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మైదుకూరు, జమ్మలమడుగు డిపో మేనేజర్లు సంస్థ నిబంధనలకు విరుద్ధంగా చార్జ్ షీట్లు ఇస్తున్నారన్నారు. డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లను అల్ట్రా డీలక్స్ సర్వీసులకు, వన్ మ్యాన్ సర్వీసుగా పంపి ప్రయాణికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కడప, ప్రొద్దుటూరు డిపోల్లో చోరీ జరిగితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోగా చర్యలు కూడా తీసుకోలేదని ఆరోపించారు. జిల్లా అధికారపోలలో జరిగే సమస్యలు తనకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కార్యదర్శి సుధాకర్, డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీ కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విజయదుర్గాలయంలో రాహుకాల పూజలు


రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్: కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళలు రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకం జరిపి అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి రాహుకాల పూజలు జరిపారు.ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను కొనసాగించాలి

కడప ఎడ్యుకేషన్: వ్యాయామ విద్య ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను ఇతర సబ్జెక్టులకు మార్పు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ స్థాయిలో విద్యార్థులు చురుకుగా ఆటల్లో పాల్గొంటూ స్టేట్, నేషనల్ స్థాయిలో మెడల్స్‌తోపాటు సర్టిఫికెట్లు సంపాదించుకుంటున్నారన్నారు. దీంతోపాటు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు తెచ్చుకునే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో 199 పీడీ పోస్టులు ఇతర సబ్జెక్టులకు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేయడం స్పోర్ట్స్ విద్యార్థులకు అన్యాయం చేయడమే అన్నారు. విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారుచేసే అవకాశం లేకుండా పోతుందన్నారు.

గ్రంథాలయాలను కాపాడుకుందాం

కడప కల్చరల్: అందరూ సంఘటితమై గ్రంథాలయాలను కాపాడుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ అన్నారు. స్థానిక సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం, కడప ఇంటాక్ చాప్టర్ ఆధ్వర్యంలో గ్రంథాలయోద్యమ పునర్వికాస ఉద్యమ వేదిక సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ 1960లో ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ లైబ్రరీ యాక్ట్ ప్రకారం ప్రజలు కట్టే పన్నుల్లో 8 శాతం గ్రంథాలయ సెస్ ఉందన్నారు. పదేళ్లలో రూ.350 కోట్లు సెస్ వసూలు కాగా, రూ.20 కోట్లు ఖర్చు చేయలేదన్నారు. 27న రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నామని, జ్ఞాన సమాజం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమంలో కదలాలని ఆకాంక్షించారు. అరసం కడప జిల్లా అధ్యక్షుడు ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు బలోపేతం చేయాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ ఒకప్పుడు విలువైన, అరుదైన పుస్తకాలను కలిగిన గ్రంథాలయాలు నేడు ఉనికిని కోల్పోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ కె.చిన్నపరెడ్డి ఆచార్య జి.పార్వతి, చెరుకు మల్లి సింగా, డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, డాక్టర్ ఎస్.రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

10 నుంచి ప్రసన్న విశ్వేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్: కడప నగరం మోక్షంపేటలోని ప్రసన్న విశ్వేశ్వరుడి బ్రహ్మోత్సవాలను ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నమని ఏవో ఏ శ్రీధర్ తెలిపారు. ఇందులో భాగంగా 10న అంకురార్పణ, 11న ధ్వజారోహణం, సూర్యప్రభ వాహనం, 12న హంస వాహనం, 13న యాలివాహనం, 14న శేషవాహనం, 15న బృంగివాహనం, 16న నందివాహనం, 17న కళ్యాణోత్సవం, 18న రథోత్సవం. 19న అశ్వ వాహనాలపై స్వామి ఊరేగింపు, 20న విశ్వరూపదర్శనం నిర్వహించనన్నట్లు ఆయన వివరించారు.

ప్రణాళికాబద్ధమైన కృషితో విజయం సాధ్యం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: ప్రణాళికాద్ధమైన కృషి, పట్టుదలతో సులభంగా విజయం సాధించవచ్చునని యోగి వేమన ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి అన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలపై వైవీయూ విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన అవకాశాలను ఉపయోగించుకోవాలని కోరారు. హైదరాబాద్ కెరీర్ కన్సల్టెంట్ సంస్థ సీఈవో రోహిత్‌రావు మాట్లాడుతూ ప్రణాళిక, క్రమశిక్షణ ఉద్యోగ అవకాశాలపై మెలకువలను ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి.విజయభారతి మాట్లాడుతూ విద్యార్థులు మెలకువలు నేర్చుకుని ముందుకు నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా.గణేష్‌నాయక్, హృత్విక్, మణికంత, ప్రియ, మేఘన, సాకేత్, అభినయ, రజని, హరినాథరెడ్డి, రవి, రామ్ ప్రసాదరెడ్డి, నిరోషా, అనంత కుమార్, రాశేఖర్, వెంకటరమణ, సుధీర్ కుమర్‌లతోపాటు పాల్గొన్నారు.


ముస్తాబైన వేదిక, ప్రార్థనలు రిహార్సల్స్ చేస్తున్న దృశ్యాలు


చర్చిలో ప్రార్థనలు చేస్తున్న, క్రైస్తవులు

అంధత్వ నివారణా వారోత్సవాలు


ఆస్పత్రి నుంచి వస్తున్న ర్యాలీలు

కడప కోటిరెడ్డిసర్కిల్: నగరంలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో మంగళవారం అంధత్వ నిర్మూలనా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ జవ్వాద్ అహమ్మద్ మాట్లాడుతూ దేశంలో పది మిలియన్ల మంది అంధత్వంతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 1వతేదీ నుంచి ఏడో తేదీ వరకు నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కంటికి అయ్యే గాయాలు, దృష్టి లోపాలు వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, చికిత్సా పద్ధతుల గురించి వైద్యులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ ఎస్.శైలరేఖ మాట్లాడుతూ అంధత్వానికి పోషకాహార లోపం ప్రధాన కారణమని తెలిపారు. చిన్న పిల్లల్లో అంధత్వానికి కారణం విటమిన్ ఎ అని, మధుమేహం ఉన్న వారిలో కంటి శుక్లం ఏర్పడి చివరికి అంధత్వానికి కారణమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సల్మాన్ ముర్తుజా, జయరామిరెడ్డి, డాక్టర్ రామమనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా చర్యలు

కడప కార్పొరేషన్: వేసవి కాలంలో విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు కడప విద్యుత్తు శాఖ డీఈఈ హరిసేవ్యా నాయక్ తెలిపారు. కడప డివిజనల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పక్కీరుపల్లె, ఎల్‌ఐసీ సర్కిల్‌లోని సబ్ స్టేషన్, బాలాజీనగర్‌లో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చామన్నారు. ఎల్‌ఐసీ వద్ద 33కేవీ లైన్ ఓవర్‌లోడ్ కావడంతో ఫీడర్లను డైవర్షన్ చేసి లోడ్ తగ్గించామన్నారు. ద్వారకా నగర్, శివానందపురం 11కేవీ లైన్‌నూ ఓవర్ లోడ్ కావడంతో వేరే ఫీడర్లకు మార్చి లోడ్ తగ్గించామన్నారు. ఇప్పటివరకూ కడప డివిజన్‌లో 36 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, 52 160కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, రెండు 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, ఒక 315కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ పరిధిలో 44 సబ్ స్టేషన్లు ఉన్నాయని, ఆర్టీసీ బస్టాండులోని సూర్య హాస్పిటల్ వద్ద కొత్త సబ్‌స్టేషన్‌కు నిధులు మంజూరయ్యాయన్నారు.ఆరు మాసాల్లో పూర్తి చేస్తామని, విద్యుత్ సమస్యలు ఏర్పడినా, ఆయా సబ్ స్టేషన్ల ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్లు, ఏఈ, డీఈఈల నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

మెరిసిన కడప బిడ్డ

క్రీడా రంగంలో కడప బిడ్డ మెరిసింది. వైఎస్సార్ జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపింది. యర్రంపల్లె నుంచి శ్రీలంక టోర్నీలో భారత జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తూ క్రీడా ఆణిముత్యంగా నిలుస్తోంది. క్రీడల్లో రారాజుగా వెలుగుతున్న క్రికెట్‌లో సత్తా చాటుతున్న ధ్రువతార, ఉమెన్ ప్రీమియర్ లీగ్ నుంచి భారత జట్టులో చోటు సంపాదించింది. జిల్లా ఖ్యాతిని నిలిపిన ఆ యువతి పేరు శ్రీచరణి.

- భారత క్రికెట్ జట్టులోకి ఎంపికైన శ్రీచరణి
- యర్రంపల్లె నుంచి శ్రీలంక టోర్నీకి
- ఉమెన్ ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున రాణింపు


శ్రీచరణి

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండలం యర్రంపల్లె గ్రామానికి చెందిన నల్లపురెడ్డి చంద్రశేఖరరెడ్డి, రేణుక దంపతుల కుమార్తె శ్రీచరణి. తండ్రి ఆర్టీపీపీలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్. ఒకటి నుంచి 10వ తరగతి వరకూ ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్‌లో చదివింది. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని లేపాక్షి జూనియర్ కళాశాలలో పూర్తిచేసింది. ప్రస్తుతం వీఎన్‌పల్లె వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతూ క్రికెట్‌లో రాణిస్తోంది.

అండర్–19 నుంచి భారత జట్టు స్థాయికి....

2017–18లో క్రికెట్‌లో జిల్లా అండర్–19 జట్టుకు ఎంపికైంది. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూడలేదు. అదే ఏడాది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. జిల్లాకు చెందిన క్రికెట్ శిక్షకులు ఖాజామైనుద్దీన్, మధుసూదన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఎన్నో మెలకువలు నేర్చుకుంది. 2021లో అండర్–19 చాలెంజర్స్ ట్రోఫీలో ఇండియా–సి జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీచరణి 4 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. 2023లో బీసీసీఐ సీనియర్ అంతర్ రాష్ట్ర మహిళల క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించి కర్నాటక జట్టుపై 7వికెట్లు, అండర్–23 మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టుపై 5వికెట్లు తీసి ఉత్తమ ప్రదర్శన కనబర్చింది. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా, లెఫ్ట్ హ్యాండ్ బ్యాట్స్ ఉమెన్‌గా నిలకడగా రాణిస్తోంది. శ్రీచరణి ఆట నైపుణ్యం గుర్తించిన డబ్ల్యూపీఎల్ ప్రతినిధులు ఢిల్లీ క్యాపిటల్స్‌కు రూ.55 లక్షలతో ఎంపిక చేసుకున్నారు. తాజాగా ఏప్రిల్ 27 నుంచి జరిగే ముక్కోణపు వన్డే సిరీస్‌కి నల్లపురెడ్డి శ్రీచరణి తొలిసారి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం..

చిన్నప్పటి నుంచి ఆటలపై ఇష్టం చూపెట్టే శ్రీచరణిని తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న శ్రీచరణి క్రికెట్‌పై ఆసక్తి చూపగా అమ్మానాన్న మొదట సందేహించారు. క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని గమనించిన మామ కిశోర్‌కుమార్ రెడ్డి శ్రీచరణిని ప్రోత్సహించారు. సరదాగా మొదలు పెట్టిన క్రికెట్ ఇప్పుడు సర్వస్వం అయింది. భారత జట్టు స్థాయికి చేరుకోవడంతో ఓవైపు తండ్రి చంద్రశేఖరరెడ్డి, మరోవైపు మామ కిశోర్‌కుమార్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రోత్సహం ఉంటే అమ్మాయిలు కూడా ఎందులోనైనా రాణించగలరని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీఏవైడీ హర్షం...

భారత జట్టులో స్థానం సంపాదించి ముక్కోణపు టోర్నీలో శ్రీలంక టూర్‌కు శ్రీచరణి ఎంపిక కావడంపై క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్ష కార్యదర్శులు ఎం భరత్ రెడ్డి, ఏ రెడ్డిప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. కడప గడపలో శిక్షణ పొందిన శ్రీచరణి అంచెలంచెలుగా ఎదుగుతూ క్రికెట్ రంగంలో రాణిస్తున్న వైనాన్ని వారు వివరించారు. భారత జట్టుతో సుస్థిర స్థానం సంపాదించే ప్రతిభ శ్రీరణిలో ఉందని వారు అభిప్రాయపడ్డారు.


సీఏవైడీతో శ్రీచరణి


కుటుంబ సభ్యులతో శ్రీచరణి


పట్టాభిషేకానికి ఏర్పాట్లు

నేటి పట్టాభిషేక వివరాలు

కడప కల్చరల్: బిషప్ పట్టాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 గంటలకు మరియాపురం నుంచి ఊరేగింపుగా పట్టాభిషేక వేదిక వద్దకు రానున్నారు. పోప్ దూత, కడప ఆపోస్తలిక పాలనాధికారి డాక్టర్ గాలిబాలి, విజయవాడ మేత్రాసన పీఠాధిపతి డాక్టర్ టి.జోసఫ్‌రాజారావు, నూతన బిషప్‌ను పట్టాభిషక్తులను చేసి ప్రసంగించనున్నారు.

బిషప్ నేపథ్యం

నూతన కథోలిక దయాసిస్ బిషప్ మోస్ట్ రెవడెండ్ సగినాల పాల్ ప్రకాష్ వైఎస్సార్ కడప జిల్లా పలుగురాళ్లపల్లె గ్రామానికి చెందిన వారు. 1961 జూన్ 12న జన్మించారు. విశాఖపట్నం, హైదరాబాదు, ఎస్‌కే విశ్వ విద్యాలయ, ఢిల్లీ వర్సిటీలలో ఉన్నత విద్య పూర్తి చేశారు. జర్నలిజంతోపాటు ఆపోస్తలిక, మైనర్ సెమినరీ తదితర అంశాలపై నెల్లూరు, విజయవాడలలో శిక్షణ పొందారు. ఫిలాషఫి, థియాలజీ, బైబిల్ థియాలజీ, అర్చక ఆర్డినేషన్ ససెర్డోటల్ తదితర శిక్షణలు పూర్తి చేశారు. ప్రస్తుతం పోప్ ఎంపిక మేరకు కథోలిక దయసిస్ బిషప్‌గా విచ్చేయనున్నారు.


బిషప్ పట్టాభిషేకానికి ఏర్పాటు చేసిన కుర్చీలు, సోఫాలు

అంతర్జాతీయ కథోలిక ప్రతినిధికి సన్మానం


స్వాగతం పలుకుతున్న నగరవాసులు

కడప కార్పొరేషన్: వాటికన్ సిటీ నుంచి గరానికి విచ్చేసిన అంతర్జాతీయ కథోలిక ప్రతినిధి ఇనాస్సియో, కార్డినల్ పూల అంతోనిలకు కడపలో ఘన స్వాగతం లభించింది. కథోలిక దయాసిస్ బిషప్‌గా సగినాల పాల్‌ప్రకాష్ పట్టాభిషేకం బుధవారం జరుగనుండడంతో వారు కడపకు విచ్చేశారు. ఈ సందర్భంగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత పెనుబాల విజయ్ కుమార్, ఆయన సతీమణి మౌనిక వారికి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం విజయకుమార్ పెనుబాల మాట్లాడుతూ కథోలిక క్రైస్తవ ప్రతినిధులుగా వారు కడపకు రావడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. వారిని తాము కలవడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అనంతరం వారిని ర్యాలీగా కాన్వాయ్‌లో తీసుకొచ్చి బిషప్ హౌస్‌కు చేర్చారు. ఈ కార్యక్రమంలో నల్గొండ, హైదరాబాద్, శ్రీకాకుళం పీఠాధిపతులు తదితరులు పాల్గొన్నారు.